గణేశ్ నవరాత్రుల సందడి షురూ

- భారీ స్థాయిలో మండపాల ఏర్పాటు
- వివిధ డిజైన్లలో రూపొందిస్తున్న కళాకారులు
- జోరుగా వినాయక ప్రతిమల విక్రయాలు
- మట్టి విగ్రహాలకు జైకొడుతున్న భక్తులు



విజయవాడ జాతీయ రహదారి పక్కన విక్రయానికి ఉన్న గణపతి విగ్రహాలు



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వినాయక ప్రతిమలు

వనస్థలిపురం/చైతన్యపురి/ మన్సూరాబాద్‌: ఎల్బీ నగర్, మలక్‌పేట నియోజకవర్గాల పరిధిలో గణేశ్ నవరాత్రుల సందడి మొదలైంది. కాలనీలు, బస్తీల్లో యూత్ అసోసియేషన్లు, కాలనీ, బస్తీల అభివృద్ధి కమిటీలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో మండలపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే మండపాల ఏర్పాటు పూర్తి కాగా, మరికొన్ని చోట్లను విస్తృతంగా పనులు జరుగుతున్నాయి. వేరే రాష్ట్రాల నుంచి కళాకారులను తీసుకొచ్చి లక్షల రూపాయలను ఖర్చు చేసి భక్తులను ఆకట్టుకొనేలా ప్రత్యేక డిజైన్లలో మండపాలను రూపొందిస్తున్నారు.

- మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. పర్యావరణానికి పెద్దపీట వేస్తూ చాలా మంది ఈసారి గణనాథుడి మట్టి విగ్రహాలను ప్రతిష్ఠంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఆర్డర్ ఇచ్చి ముందుగా గణపతి విగ్రహాలను తయారు చేయించిన వారు వాటిని ఇప్పటికే మండపాల వద్దకు తరలించగా, మరికొందరు విగ్రహాల కొనుగోలు చేసే బిజీలో ఉన్నారు.
- నాగోలు, ఉప్పల్, వనస్థలిపురం, హయత్‌నగర్, ఆటోనగర్ ప్రాంతాల్లో పెద్దపెద్ద షెడ్డులు ఏర్పాటు చేసి గణపతి ప్రతిమలను ఇప్పటికే విక్రయానికి సిద్ధంగా ఉంచారు. గణపతి విగ్రహాలు నాగోలు, ఉప్పల్, ఆటోనగర్, హయత్‌నగర్, ఇంజాపూర్, వనస్థలిపురం ప్రాంతాలలో లభ్యం అవుతున్నాయి.పెద్దపెద్ద షెడ్డులు ఏర్పాటు చేసి గణపతి ప్రతిమలను విక్రయిస్తున్నారు.
- ఎల్‌బీనగర్, మలక్‌పేట, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలలోని వివిధ కాలనీల నుంచి గణపతి ఉత్సవ నిర్వాహకులు ఇక్కడకు వచ్చి కొనుగోలు చేసుకొని వెళ్తున్నారు. అడుగున్నర విగ్రహాలు రూ.2000, 3 అడుగుల విగ్రహాలు 8 నుంచి 10 వేలు, 6–7 అడుగుల భారీ ప్రతిమలను సుమారు 20 నుంచి 30 వేల వరకూ విక్రయిస్తున్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో పోలిస్తే మట్టి విగ్రహాల ధర అధికంగా ఉందని మండపాల నిర్వాహకులు చెప్తున్నారు.
- వనస్థలిపురం రామాలయం ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 42 ఏళ్లుగా గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చింతల రవి కుమార్ తెలిపారు.
- వనస్థలిపురం రెడ్ వాటర్ ట్యాంక్ కూడలిలో అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 39వ సారి గణపతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బీరం శ్రీధర్ తెలిపారు. బెంగాల్ కళాకారులతో రూ. 3.13 లక్షలతో పండపాన్ని సిద్ధం చేస్తున్నారు.
- సాహెబ్‌నగర్‌లో శ్రీ రామ్ గణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 38 సంవత్సరాలుగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ముద్దగౌని జగన్‌మోహన్‌గౌడ్ తెలిపారు.
- ఎస్‌కేడీనగర్‌లోని డీపీఎస్ గ్రౌండ్‌లో ఆజాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 11 సంవత్సరాలుగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు అరుణ్ తెలిపారు. 12వ వార్షికోత్సవం సందర్భంగా ఈ సారి గణపతి ఉత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

కమలానగర్‌లో 'షోడశ భుజ గణపతి'

చైతన్యపురి: శ్రీమణికంఠ అయ్యప్ప భక్త సమాజం ఆధ్వర్యంలో చైతన్యపురి కమలానగర్‌లో ఏర్పాటు చేస్తున్న గణపతి విగ్రహం తుదిమెరుగులు దిద్దుకుంటోంది. ఖైరతాబాద్ గణేషుడి తర్వాత నగరంలోనే ప్రాచుర్యం పొందిన గణపతిని 1976 నుంచి ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని, ఈఏడాది 31 అడుగులతో మట్టి వినాయకుడిని షోడశ భుజ గణపతి ఆకారంలో రూపొందిస్తున్నామని భక్త సమాజం కన్వీనర్ తులసి శ్రీనివాస్ విలేకరులకు తెలిపారు. ఖైరతాబాద్ విగ్రహ రూపశిల్పి రాజేందర్ చేతుల మీదుగా ఈ విగ్రహం రూపుదిద్దుకుంటోందన్నారు. ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యం, శిల్పి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



వనస్థలిపురంలో అభిమన్యు యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



ఎస్‌కేడీనగర్ డీపీఎస్ గ్రౌండ్‌లో ఆజాద్ యూత్ ఆధ్వర్యంలో...



మన్సూరాబాద్ డివిజన్ వినాయక్‌నగర్‌లో విక్రయానికి ఉంచిన మట్టి గణపతి విగ్రహాలు



కమలానగర్‌లో తుదిమెరుగులు దిద్దుకుంటున్న గణేశుడు

క్లుప్తంగా

ఎన్టీఆర్ నగర్‌లోని పేదలకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి



శ్రీరాములు యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న ఎన్టీఆర్‌నగర్ వాసులు

దిల్‌సుఖ్‌నగర్: ఎన్టీఆర్ నగర్‌లోని పేదలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్లు కేటాయించాలని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డితో కలిసి గడప గడపకూ బీజేపీ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ, ఎన్టీఆర్‌నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు ఇంకా ఎన్ని ఏళ్లకు ఇస్తారో మంత్రి సబితమ్మ చెప్పాలని డిమాండ్ చేశారు. లక్షల్లో దరఖాస్తులు వస్తే కేవలం 25 వేల ఇళ్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధీరజ్‌రెడ్డి, పిట్ట ఉపేందర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు ముంతా రాములు, సిద్దూముదిరాజ్, సంతోష్, సుదర్శన్ పాల్గొన్నారు.

పండగలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలి: డీసీపీ

హయత్‌నగర్: పండగలను సామరస్యంగా జరుపుకోవాలని, పండగలు ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ అన్నారు. ఈ నెల 28న వినాయక నిమజ్జనం, మిలాద్–ఉన్–నబీ ఒకే రోజు జరగనుండటంతో శుక్రవారం ఆమె హయత్‌నగర్‌లోని హయత్‌బక్షీ మసీద్‌లో ముస్లింలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఎవరి సాంప్రదాయం ప్రకారం వారి పండగలను జరుపుకోవాలని, ఇతరుల మనోభావాలను గౌరవించాలని కోరారు. మిలాద్ ఉన్ నబీని ఎలాంటి ఆటంకం లేకుండా జరుపుకునేందుకు తమ వంతు సహాయ సహకరాలు అందిస్తామన్నారు. షోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ఇస్లాం ఎప్పుడు ఇతరులకు హాని చేయాలని చెప్పదని, ప్రతి ముస్లిం ఇతరుల పట్ల గౌరవంగా మెలగాలని మసీద్ మౌలానా రఫీఖ్ అహ్మద్ తెలిపారు. హయత్‌నగర్‌లో హిందు, ముస్లింలు ఎంతో కాలంగా కలిసి మెలసి జీవిస్తున్నారని, దీనిని కొనసాగిస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు, వనస్థలిపురం ఏసీపీ భీంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి



అధికారులతో కలిసి కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో తరచూ పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని జలమండలి, సివరేజ్ బోర్డు అధికారులను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. శుక్రవారం ఆయన జలమండలి, సివరేజ్ బోర్డు జీఎం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి డివిజన్‌లో డ్రైనేజీ సమస్య ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు. సిల్ట్ గ్రాబర్ వాహనాలను అందుబాటులో ఉంచాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో అధికారులు సీజీఎం నాగేందర్, మేనేజర్ ప్రేమ్‌కుమార్, కాలనీ వాసులు శ్యాంసుందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ సైక్లింగ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

నాగోలు: టార్గెట్ సైక్లింగ్ ఛాంపియన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2 న టార్గెట్ సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీల పోస్టర్‌ను శుక్రవారం నాగోలులో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, టార్గెట్ సైక్లింగ్ ఛాంపియన్స్ ఫౌండేషన్ ఫౌండర్ నాగరాజు కొత్తపల్లి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణలోని 33 జిల్లాలలోని పల్లెల్లో గల 8 నుంచి 13 సంవత్సరాల మధ్య వయస్సు గల బాల బాలికలకు టార్గెట్ సైక్లింగ్ ఛాంపియన్స్–2023 పోటీలు నిర్వహిస్తామన్నారు. యువ వర్ధమాన సైక్లిస్టులను ప్రోత్సహించడమే ఈ పోటీల లక్ష్యమన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, నాగరాజు

సరూర్‌నగర్ చెరువు కట్టను పరిశీలించిన పోలీసు అధికారులు



చెరువు కట్టను పరిశీలిస్తున్న అడిషనల్ సీపీ విక్రమ్‌సింగ్ మాన్, డీసీపీ రూపేష్

సైదాబాద్: గణేశ్ నవరాత్రులు, సామూహిక గణేశ్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా సరూర్‌నగర్ చెరువు కట్టను హైదరాబాద్ పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. శుక్రవారం చెరువు కట్ట వద్దకు నగర అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ చేరుకున్నారు. నిమజ్జనం సందర్భంగా చెరువు కట్టపై చేపట్టే ఏర్పాట్లను తెలుసుకున్నారు. సామూహిక గణేష్ నిమజ్జనానికి పాతబస్తీ నుంచి ఐఎస్‌సదన్ చౌరస్తా, సైదాబాద్‌లోని డీసీపీ కార్యాలయం చౌరస్తా మీదుగా చెరువు కట్టకు, దిల్‌సుఖ్‌నగర్ జాతీయ రహదారి నుంచి శివగంగా థియేటర్ మార్గం మీదుగా సరూర్‌నగర్ చెరువు కట్టకు గణేష్ విగ్రహాల వాహనాలు చేరుకుంటాయి. తదితర వివరాలు తెలుసుకున్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేసారు. కార్యక్రమంలో సౌత్‌ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ మనోహర్, సైదాబాద్ ఏసీపీ వెంకన్న నాయక్, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్, సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ రవి మొలుగూరి, మలక్‌పేట ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ పనులకు రూ.16 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



వాటర్ వర్క్స్ ఎండీని కలిసిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: శివారు కాలనీలకు తాగునీ అందించేందుకు అదనంగా 19 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్లు మంజూరు చేయాలని, దీంతో శివారు కాలనీలకు శాశ్వత మంచినీరు అందించిన వారమవుతామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం వాటర్ వర్క్స్ ఎండీ దానకిశోర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు.ఇప్పటికే తన నియోజకవర్గంలో 62 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ల కోసం నిధులు మంజూరు చేశారన్నారు. అదనంగా మరో 19 కిలో మీటర్ల మేర పైప్‌లను వేస్తే శివారు కాలనీ ప్రజలకు ఇక మంచినీటి సమస్య ఉండదని ఆయన దానకిశోర్‌కు వివరించారు. అంతే కాకుండా భూగర్భడ్రైనేజీ పనుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన దానకిశోర్ వెంటనే రూ. 16 కోట్లు మంజూరు చేశారని సుధీర్‌రెడ్డి తెలిపారు. ఈ పనులకు వెంటనే టెండర్లు పిలువాలని, 20 రోజుల్లో పనులు ప్రారంభించాలని ఎండీ అధికారును ఆదేశించారని తెలిపారు. అదే విధంగా తాను అడిగిన 19 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ కోసం నిధులు మంజూరు చేస్తామని కూడా హామీ ఇచ్చారన్నారు. అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్న దానికిశోర్‌కు సుధీర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌కు ద్రోహం చేసినవారికి బుద్ధి చెప్పాలి

కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్



వజీర్ ప్రకాశ్‌గౌడ్ నివాసంలో మాట్లాడుతున్న మధుయాష్కి గౌడ్

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసిన వారిని వచ్చే ఎన్నికల్లో రాజకీయంగా బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ప్రకాశ్‌గౌడ్, ఆ పార్టీ ఎల్‌బీనగర్ ఎస్సీ సెల్ చైర్మన్ జోగు రాములు, ఇతర నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించేందుకు ఆయన ప్రకాశ్‌గౌడ్ నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు సమావేశంలో మధుయాష్కిగౌడ్ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన స్వలాభం కోసం, తమ భూ కబ్జాల కోసం పార్టీ మారడని ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లో సుధీర్‌రెడ్డి అరాచకాలు ఇకపై సాగవన్నారు. దేశంలో సోనియగాంధీ, రాహుల్ గాంధీ, రాష్ట్రంలోని నాయకత్వంపై నమ్మకంతో పెద్ద ఎత్తున్న కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని తిరిగి తెలంగాణలో గెలిపించుకోవాలని తెలిపారు. 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ పార్టీ విజయభేరి సభకు సోనియా, ప్రియాంక గాంధీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే వస్తున్నా సందర్భంగా సభకు లక్షలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ప్రకాశ్‌గౌడ్, అతని అనుచరులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని మధుయాష్కి అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ శేఖర్‌మామ, యోగేశ్వర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, కొత్త అశోక్, రంగారెడ్డి, శ్రీనివాస్, సుజాతరెడ్డి, లింగాల కిషోర్‌గౌడ్ ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కు వజీర్ ప్రకాష్‌గౌడ్ రాజీనామా...

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు వజీర్ ప్రకాశ్‌గౌడ్ ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. తనకు పార్టీలో సరైన గుర్తింపు లేదన్నారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరతామని ప్రకాశ్‌గౌడ్ ప్రకటించారు. సమావేశంలో జోగురాములు, సుబ్రహ్మణ్యం, మల్లేష్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలి



కిషన్‌రెడ్డితో కలిసి బైక్ ర్యాలీలో పాల్గొన్న సంరెడ్డి సురేందర్‌రెడ్డి

సైదాబాద్: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యమ సమయంలో విమోచన దినాన్ని నిర్వహించాలని డిమాండ్ చేసిన కేసీఆర్ అధికారంలోకి వచ్చాక మజ్లిస్‌తో చేతులు కలిపి మాట మార్చారని మండిపడ్డారు. అందుకే కేంద్ర ప్రభుత్వం గతేడాది పరేడ్ గ్రౌండ్స్‌లో విమోచన దినాన్ని నిర్వహించిందని, అదే విధంగా ఈ సంవత్సరం కూడా నిర్వహించనుందని తెలిపారు. తెలంగాణ జలియన్ వాలాబాగ్‌గా గుర్తింపు పొందిన పరకాలకు శుక్రవారం పరేడ్ గ్రౌండ్స్ నుంచి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తలపెట్టిన బైక్ ర్యాలీకి భాగ్యనగర్ జిల్లా నుంచి పెద్దసంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లినట్టు తెలిపారు.

బీఆర్ఎస్ వైపు యువత చూపు

సైదాబాద్: అన్ని వర్గాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో యువత బీఆర్ఎస్ పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని బీఆర్ఎస్ యాకుత్‌పురా ఇన్‌చార్జ్ సామ సుందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సింగరేణి కాలనీని చెందిన శివాజీ యూత్ అసోసియేషన్‌కు చెందిన పలువురు యువకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి సుందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ వాసుల ఆదరణతో వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు గెలిచి ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ స్వప్నారెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, పార్టీలో చేరిన వారిలో రాజు రాథోడ్, శ్రీహరి, శివ, అశోక్, గణేష్, మధు, సంతోష్, అనిల్, పృథ్వీ, మనోజ్ పాల్గొన్నారు.

ఊరేగింపు సజావుగా సాగేందుకు చర్యలు తీసుకోండి

నాగోలు: ప్రధాన రహదారుల్లో గణపతి విగ్రహాల ఊరేగింపులు సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ కోరారు. వినాయక విగ్రహాలకు చెట్ల కొమ్మలు తాకకుండా ఉండేందుకు గురువారం ఆయన కొత్తపేట డివిజన్‌లోని రహదారుల వెంబడి ఉన్న చెట్ల కొమ్మలను ఆర్బికల్చర్ డిపార్ట్‌మెంట్ వారితో కొట్టించారు.

ప్రతి ఒక్కరూ ఓర్పు చూపించాలి

నాగోలు: ఓర్పు అనేది ప్రతి ఒక్కరూ తమ జీవితంలో రోజూ చూపించే మంచి లక్షణమని యెహోవా సాక్షుల ప్రతినిధి కె. వినోద్ కుమార్ అన్నారు. నాగోల్ శుభం కన్వెన్షన్ సెంటర్‌లో యెహో సాక్షుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. దేశంలోని 40 ప్రధాన నగరాల్లో ఈ సమావేశాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.17 భాషల్లో 74 సమావేశాలు జరుగుతున్నాయని వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సమావేశం ముఖ్య ఉద్దేశం శాంతి, ఓర్పు మానవాళి కి ఎంత అవసరమో తెలియజేయడమేనని ఆయన అన్నారు.

వివిధ కేసుల్లో నలుగురి బైండోవర్

చాదర్‌ఘాట్: వివిధ కేసుల్లో నలుగురు వ్యక్తులకు జైలుశిక్ష పడిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సీఐ ప్రకాష్‌రెడ్డి కథనం ప్రకారం...

- చాదర్‌ఘాట్‌కు చెందిన షేక్ సమీర్(21) ట్రాఫిక్ హోంగార్డు. డ్యూటీలో ఉండగా, దుర్భాషలాడాడు. కోర్టులో నేరం రుజువు కావడంతో నిందితునికి 20 రోజులు జైలుశిక్షను న్యాయస్థానం విధించింది.
- సొంత అన్నను కొట్టిన కేసులో నిందితుడికి 20 రోజులు జైలుశిక్ష పడింది. సైదాబాద్‌కు చెందిన మహ్మద్ యూసఫ్(43) ఆస్తి విషయంలో గొడవ జరగడంతో సొంత అన్నను విచక్షణారహితంగా కొట్టారు. నేరం రుజువు కావడంతో శిక్ష పడింది.
- చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించిన ఘటనలో జైలుశిక్ష నడిన సంఘటన జరిగింది. సైదాబాద్‌కు చెందిన ఉదయ్‌కిరణ్(30), విష్ణ్(20)లు టెంట్ హౌస్ నడిపిస్తున్నారు.
- వీరు రోజు తాగి కాలనీలో న్యూసెన్స్ చేస్తున్నారు. కాలనీవాసుల ఫిర్యాదుతో వారిని కోర్టులో హాజరుపర్చగా ఇరువురికీ కోర్టు 16 రోజుల జైలుశిక్ష వేసింది.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 11. వంకాయ 28, బెండ 35, పచ్చిమిర్చి23, కాకర 23, బీర 23, క్యాలీఫ్లవర్ 13, క్యాబేజీ 33, క్యారెట్ 18. దొండ 21, ఆలు 29, ఉల్లి 29, గోకర 23, దోస 18, సొర 09, పొట్ల 13, అరటి 10, చిక్కుడు 50, అర్వి 35, మునగ 23, చిలగడ దుంప 45, కాప్సికమ్ 35. ఈ ధరలు శనివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

గణపతి నవరాత్రి ఏర్పాట్లపై అధికారుల నిర్లక్ష్యం: సామ



వంటా వార్పుతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, కార్పొరేటర్లు

చైతన్యపురి: గణపతి నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లలో జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. శుక్రవారం కొత్తపేటలోని జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని బీజేపీ కార్పొరేటర్ల ఆందోళన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. జోనల్ కమిషనర్ అందుబాటులో లేకపోవటంతో జడ్సీ చాంబర్ వద్దే వంటావార్పు నిర్వహించి నిరసన తెలియజేశారు. అనంతరం కార్యాలయంలో సరూర్‌నగర్ డీసీకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సామ మాట్లాడుతూ, రంజాన్, క్రిస్మస్ పండగలప్పుడు తప్ప అధికారులు గణపతి నవరాత్రులకు స్పందించటం లేదని ఆరోపించారు. కాలనీలలో శానిటేషన్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, రోడ్లు ఊడ్చిన చెత్తను కూడా తొలగించకుండా వదిలేస్తున్నారని ఆరోపించారు. గణేశ్ ఉత్సవాలు త్వరలో ప్రారంభం కాబోతున్నా చెట్ల కొమ్మలు తొలగించలేదని, రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. కనీసం కార్పొరేటర్లు, అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయలేదని ఆరోపించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగానర్సింహ గుప్తా, వంగా మధుసూదన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సురేందర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, నవజీవన్ రెడ్డి, పవన్‌కుమార్, బీజేపీ నాయకులు శ్రీనివాస రెడ్డి, జయప్రకాష్, వివేకానందరెడ్డి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాల్లో గొడవలు చేస్తే కఠిన చర్యలు



పాతనేరస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సీఐ జలంధర్‌రెడ్డి

హస్తినాపురం: గణేశ్ నవరాత్రుల సందర్భంగా పాతనేరస్తులెవ్వరూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించకుండా సత్ప్రవర్తనతో మెలగాలని, ఎలాంటి గొడవ చేసినా కఠిన చర్యలు తప్పవని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ దేప జలేంధర్‌రెడ్డి హెచ్చరించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది పాతనేరస్తులను స్టేషన్‌కు పిలిపించిన సీఐ... ఎలాంటి నేరాలకు పాల్పడమని వారిచే ప్రమాణం చేయించారు. అనంతరం వారిని హయత్‌నగర్ తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. సరూర్‌నగర్ మండలం ఇందిరానగర్‌కు చెందిన సెనావత్ గణేశ్, హఫీజ్‌బాబానగర్‌కు చెందిన ఎండీ ఫరూక్, అబ్దుల్లాపూర్ మండలం ఇంజాపూర్‌కి చెందిన ఎండీ ఆసీఫ్, చింతలకుంటకు చెందిన ఎండీ అహ్మద్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రగతినగర్‌కు చెందిన మిర్జా జఫరుల్లాహ్ అన్వర్‌బేగ్ ను తహసీల్దార్ ముందు బైండోవర్ చేశామని సీఐ వెల్లడించారు. అలాగే, నాగోలు ఆదర్శనగర్‌కు చెందిన శరత్ జాన్సన్, నల్లగొండ జిల్లా కుర్మపల్లికి చెందిన జోగు గణేశ్, దొరపల్లి శివ, హయత్‌నగర్ మండలం భాగ్యలత లెక్చరర్స్ కాలనీకి చెందిన పాన్నేరి శ్రీనివాసరావు, హస్తినాపురానికి చెందిన ముద్దగోని సుమన్‌గౌడ్, హయత్‌నగర్ పాత గ్రామానికి చెందిన ఎండీ దావూద్ జకీర్‌లను బైండోవర్ చేశామని సీఐ జలేంధర్‌రెడ్డి చెప్పారు.

ప్రశాంతంగా టెట్

హయత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) శుక్రవారం హయత్‌నగర్‌లో ప్రశాంతంగా జరిగింది. హయత్‌నగర్ పోలీస్టేషన్ పరిధిలోని 5 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష మొదలు కాగా, పాతబస్తీకి చెందిన ఓ విద్యార్థి 3 నిమిషాలు లేటుగా పరీక్షా కేంద్రం వద్దకు వచ్చాడు. అతడు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఆయన పోలీసులతో వాగ్వాదానికి దిగాడు. పాఠశాలకు ఎలాంటి బోర్డు లేక పోవడం, ట్రాఫిక్ కారణంగా అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.



లోపల తల్లికి 'పరీక్ష'.. బయట బిడ్డకు తండ్రి లాలన



హయత్‌నగర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాల పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థుల సందడి



అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్షా కేంద్రంలోకి పంపుతున్న పోలీసులు